నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం | 01 డిసెంబర్ 2024 | పేజీలు 8

## వైసీపీ ఇన్‌చార్జ్‌లతో మాజీ మంత్రి కాకాని భేటి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి నివాసంలో శనివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ, రూరల్, కావలి సులూరుపేటతో పాటు వివిధ నియోజక వర్గాల ఇన్చార్జిలతో పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీ బలోపేతంతోపాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన వివిధ రాజకీయ అంశాలకు సంబంధించి చర్చించారు. వైసీపీ జిల్లా కమిటీ నిర్మాణంతోపాటు అనుబంధ సంఘాలకు సంబంధించి పలు అంశాలను కాకాని దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, వైసీపీ నెల్లూరు నగర నియోజకవర్గం ఇంచార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు రూరల్ నుంచి ఆనం విజయ్ కుమార్ రెడ్డి, కావలి నియోజకవర్గ ఇన్చార్జి రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, సులూరుపేట ఇన్చార్జి కిలివేటి సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

సాధారణంగా తారురోడ్డు వేస్తే కనీసం పదేళ్ల పాటు ఢోకా ఉండదని అంటుంటారు జనం. అదేంటో కానీ, రాపూరులో రోడ్డు వేస్తే మూడు నెలలు దాటక ముందే మూలన పడిపోతుంది. పేరుకి ప్యాచ్ వర్కే అయినా.. చాలా వరకు కొత్తగా వేసిందే. అయినా కనీసం ఒక ఏడాది పాటు ఉండదా.. అని జనం ముక్కున వేలేసుకుంటున్నారు. ఏంటీ, ఈ మతలబు తెలియాలంటే.. రాపూరు నుంచి గూడూరు మార్గంలో మద్దెల మడుగు నుంచి చెర్లోపల్లి సమీపంలోని 7వ కిలో మీటర్ వరకు ఇటీవల నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక, నిర్మించిన రోడ్డు పనులను చూస్తే అవగతమవుతుంది.

వివరాల్లోకి వెళితే..

# ఈ రోడ్డు కూడా.. పాయె !




- రోడ్డు నిర్మాణంలో నాణ్యత డొల్ల..
- రూ.17 లక్షలతో వేసిన రోడ్డు మూన్నెళ్లకే గుంతలమయం
- ఆర్అండ్‌బి అధికారుల కమీషన్ల కక్కుర్తే కారణమా !
- అవస్థలు పడుతున్న వాహనదారులు

**రాపూరు, మేజర్‌న్యూస్ :**


గత ప్రభుత్వంలో రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో మద్దెల మడుగు నుండి చెర్లోపల్లి సమీపంలోని 7వ కిలోమీటరు వరకు 4.7 కి.మీ రోడ్డు విపరీతంగా ధ్వంసమై వాహనదారులు చాలా ఇబ్బందులు పడేవారు. అసలే సింగిల్ రోడ్డు, ఆపై వాహనాల రాకపోకలు అధికంగా ఉండే ఈ మార్గంలో స్టోన్ క్రషర్‌లు కూడా ఉండటంతో భారీ టిప్పర్‌లు అధిక లోడుతో ప్రయాణం చేస్తూ ఉండటం వల్ల గుంతలు పడి ప్రయాణీకులకు నరకం చూపేవి. ప్రభుత్వం మారిన రెండు నెలలకే ఆర్ అండ్‌బీ అధికారులు ఆఘ మేఘాల మీద టెండర్‌లు పిలిచి గుంతలు పూడ్చే ప్యాచ్‌వర్క్ కోసం రూ.17 లక్షలతో 4.7 కి.మీ దూరం అంచనాలు రూపొందించి పనులు కాంట్రాక్టర్‌కి అప్పగించేశారు. దాదాపు 15 రోజుల్లో చక చకా గుంతలన్నీ చదును చేసి, దెబ్బతిన్న రోడ్డంతా జేసీబీ లతో పూర్తిగా తీసేసి కొత్తగా వెట్‌మిక్స్ వేసేసి తారు రోడ్డు వేసేశారు. ఇదంతా చూసిన జనం -మిగతా 2లో

### ప్రజలే స్వచ్ఛందంగా
## టీడీపీ సభ్యత్వాలను తీసుకుంటున్నారు


2లో..

- మంత్రి పొంగూరు నారాయణ
- డివిజన్ అధ్యక్షులు, ముఖ్యనేతలతో మంత్రి సమీక్ష..

### అమెరికా పారిశ్రామికవేత్తలకు, ప్రభుత్వానికి వారధిగా
## ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**జలదంకి, మేజర్‌న్యూస్ :** అమెరికా పారిశ్రామిక వేత్తలకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వారధిగా నిలుస్తున్నారు. అమెరికా పారిశ్రామికవేత్తలతో ఉన్న సంబంధాలను, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అనుసంధానం చేస్తూ, రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో అమెరికా పారిశ్రామికవేత్తలైన విమల్ కుమార్ కొలప్ప, సాయి కిరణ్ కొలవెన్నులను పరిచయం చేశారు. ఎన్నారై పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తొలి ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో ఆగ్రో ఫామ్స్ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేస్తున్న ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందిస్తూ, మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుటకు అండగా ఉంటానంటూ భరోసానిచ్చారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేస్తున్న కృషిని రాష్ట్ర ప్రతినిధులతో పాటు ఉదయగిరి ప్రాంత ప్రజలు అభినందిస్తున్నారు.

### ప్రజలందరూ
## అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ ఆనంద్**



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఫెంగల్ తుపాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచించారు. శనివారం సాయంత్రం కలెక్టరు వారి క్యాంపు కార్యాలయం నుంచి భారీ వర్షాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు.ప్రస్తుతం సోమశిలకు ఇన్ఫ్లో, ఔటఫ్లో సమానంగానే ఉన్నాయని, భారీ వర్షాలు కురుస్తున్నందున అన్నమయ్య జిల్లా

# ప్రజలపై విద్యుత్ భారం మోపుతుంది

## మాజీ మంత్రి కాకాని వెల్లడి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని ప్రజలపై విద్యుత్ భారాన్ని ప్రభుత్వం మోపుతోందని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా విద్యుత్ చార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. దీపావళి సందర్భంగా విద్యుత్ చార్జీలు పెంచారని ఆరోపించారు. మరోసారి రూ.9,412 కోట్ల వడ్డింపులకు రంగం సిద్ధం చేశారని తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.15,486 కోట్ల మేర అదనపు భారాన్ని వేశారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాల వల్ల విద్యుత్ భారం పడుతోందని చంద్రబాబు చెప్తున్నారని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ రంగం సంక్షోభంలో కూరుకుపోవడానికి చంద్రబాబు కారణం అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ట్రూఅప్ చార్జీలు ఎత్తివేస్తామని చెప్పారన్నారు. విద్యుత్ రంగంపై విడుదల చేసిన శ్వేతపత్రంలో కూడా అబద్ధాలు చెప్పారు. ప్రజలను మోసం చేయడంలో బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అన్నారు.కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని పదేపదే ప్రకటించారు, వాటి అమలుకు కూడా తూట్లు పొడుస్తున్నారని వివరించారు. ఇచ్చిన హామీలను విస్మరించడంతోపాటు ప్రజలపై అదనపు భారాన్ని మోపుతున్నారన్నారు. బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అన్నారు.. ఇప్పుడది బాబు షూరిటీ.. బాదుడు గ్యారెంటీ అని నిరూపిస్తున్నారు. మరోసారి విద్యుత్ చార్జీలను పెంచేందుకు రంగం సిద్ధమైందన్నారు. జనవరి నుంచి వచ్చే బిల్లుల్లో ఈ భారం ఉంటుందని తెలిపారు. 2014-19లో చంద్రబాబు హయాంలో పవన విద్యుత్‌కు సంబంధించి 133 ఒప్పందాలు చేశారు. సోలార్‌కు సంబంధించి యూనిట్‌ను రూ.6.80 పైసలకు కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నారు. జగన్ హయాంలో ఎప్పుడూ లేనంతగా సెకి సంస్థతో రూ.2.49 పైసలకు ఒప్పందం చేసుకున్నారని, ఎవరి వల్ల ప్రభుత్వానికి ఆదా అవుతుందో గమనించాలని కోరారు. చంద్రబాబు నిర్ణయాల వల్ల ప్రజలపై దాదాపు రూ.90 వేల కోట్ల భారం పడిందని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగాయన్నారు. సంపద సృష్టించి ప్రజలకు పంచుతానని చెబుతున్న చంద్రబాబు.. ప్రజల సంపద ఆవిరయ్యేలా చేస్తున్నారని విమర్శించారు. ప్రజలపై భారం మోపే నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే వైసీపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.



# కోయంబత్తూర్ నుండి అమరావతి వరకు యువతి కాలినడక



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఈ ఆడబిడ్డ పేరు భారతి. సొంత ఊరు విజయనగరం జిల్లా. 15 ఏళ్ల క్రితం వీరి తల్లిదండ్రులు ఉపాధి కోసం తమిళనాడులోని కోయంబత్తూర్‌కి వెళ్లి స్థిరపడ్డారు. దురదృష్టవశాత్తు కరోనాలో వీరి తండ్రి, తర్వాత తల్లి పరమపదించారు. ప్రస్తుతం ఈమె కోయంబత్తూర్‌లోని స్పిన్నింగ్ మిల్లులో పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మీద ఉన్న ప్రేమ, అభిమానంతో ఆయన గెలిస్తే.. ఆంధ్ర రాష్ట్రం బాగుపడుతుందనే ఉద్దేశంతో ఉండేది. ఆయన గెలిచిన తర్వాత కాలినడకన కోయంబత్తూరు నుండి మంగళగిరి వరకు చేరుకొని పవన్ కళ్యాణ్‌ని కలిసి తిరుగు ప్రయాణంలో తిరుపతికి వెళ్ళి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించి కోయంబత్తూరు వెళ్ళాలని సంకల్పించుకుంది. ఈ క్రమంలో ఆమె కోయం బత్తూర్ నుండి 900 కిలోమీటర్లు నడిచి మంగళగిరి చేరుకుంది. కానీ దురదృష్టవశాత్తు పవన్ కళ్యాణ్ అక్కడ లేరు. ఎన్నికల ప్రచారం కోసం మహారాష్ట్ర వెళ్లారని తెలుసుకొని తిరిగి రావడానికి సమయం పడుతుందని భావించి, మంగళగిరిలోని పార్టీ ఆఫీస్ వారి సహాయంతో తిరుగు ప్రయాణమై తిరుపతి వెళ్లి స్వామి వారిని దర్శించుకుంది. తిరిగి మంగళగిరి వెళ్లి పవన్ కళ్యాణ్‌ని కలవాలని ఆమె కోరుకుంది. ఈ క్రమంలో ఆమె కాలి నడకన వస్తుందని తెలుసుకున్న జనసేన నాయకుడు కాకు మురళి రెడ్డి పార్టీ ఆఫీసుకు తెలిపారు. నెల్లూరు జిల్లా జనసేన నాయకులు వీర మహిళలు, సింహపురి హాస్పిటల్ వద్దకు వెళ్లి, ఆమెను వీర మహిళలు నందిని, వరలక్ష్మి, ప్రసన్న స్వాగతించగా, జనసేన నెల్లూరు జిల్లా నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, శ్రీరామ్ అడ్వకేట్, కృష్ణారెడ్డి, రవికుమార్ వేటూరి, గుడి హరి రెడ్డి, జనసేన పార్టీ ఆఫీస్ ఇన్చార్జి జమీర్, గుర్రం కిషోర్, పేనేటి శ్రీకాంత్, ప్రశాంత్ రామ్, కాకు మురళి రెడ్డి, పవన్ యాదవ్.. ఆమెను సత్కరించి నెల్లూరు జిల్లా పార్టీ ఆఫీసుకు తీసుకువచ్చి భోజన వసతులు కల్పించారు. ఈ క్రమంలో ఆమె తిరుపతికి వెళ్లి అక్కడి నుంచి మంగళగిరి వెళ్లే దానికి కావలసిన ఆర్థిక సహాయం నూనె మల్లికార్జున యాదవ్, కాపు మురళి రెడ్డి అందించారు. నెల్లూరు నుండి తిరుపతికి సాగనంపుతూ తిరుపతిలో కూడా ఆమెకు సహాయపడాలని అక్కడి జనసేన నాయకులకు తెలిపారు. ఆమె ప్రయాణం ప్రశాంతంగా జరగాలని, పవన్‌కళ్యాణ్‌ని కలిసి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

# ఈ రోడ్డు కూడా.. పాయె !



*(మొదటి పేజీ తరువాయి)*

చాలా సంతోష పడ్డారు. ప్రభుత్వం ఇంత త్వరగా తమ సమస్య పరిష్కరించిందనుకునేలోపే.. అది మూన్నాళ్ల ముచ్చటే అని, 3 నెలలు తిరిగే సరికి అర్థమయ్యేలా చేశారు ఆర్అండ్‌బీ అధికారులు. ఇప్పుడున్న రోడ్డు దుస్థితిని చూస్తుంటే పెనం నుంచి పొయ్యిలో పడినట్లయిందని జనం వాపోతున్నారు. ఆర్అండ్‌బీ అధికారుల కమీషన్ల కక్కుర్తి.. పర్యవేక్షణ లోపం, శాపంగా మారి నిత్యం ప్రయాణీకులకు నరకం చూపిస్తుంది. నేతిబీరలో నెయ్యి ఉండదు.. తారురోడ్డులో తారు ఉండదు.. అని ఆర్అండ్‌బీ అధికారులు నిరూపించారని జనం వాపోతున్నారు. అధికారులు భారీగా కమీషన్లు దండుకొని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇదే విషయమై ఆర్అండ్‌బీ ఏఈ మనోహర్‌ని 'మేజర్‌న్యూస్' వివరణ కోరగా.. ఒక సంవత్సరం పాటు కాంట్రాక్టర్‌కి నిర్వహణా బాధ్యత ఉందన్నారు. ఆయనతో మాట్లాడి గుంతలు పూడ్చే కార్యక్రమం చేస్తామని వివరించారు.



## ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

*(మొదటి పేజీ తరువాయి)*

నుంచి సోమశిల జలాశయానికి వరద ప్రవాహం పెరిగితే పరిస్థితిని బట్టి నీటి విడుదలకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పెన్నానది పరివాహక ప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ అధికారులందరూ ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆత్మకూరు, కావలి, నెల్లూరు ఆర్డీవోలు సోమశిల ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సోమశిల నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తూ తదనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. సోమశిల ఎస్ఈ, ఈఈలు తమ సిబ్బందిని అందరిని అందుబాటులో ఉంచుకోవాలని, జలాశయంలో నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన కంట్రోలు రూమ్‌లు నెల్లూరు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంతో సమన్వయం చేసుకుని ప్రజలకు సహాయం అందించాలన్నారు. లోతట్టు ప్రాంతాలు ఎక్కడైనా ముంపుకు గురైతే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. తీరప్రాంత గ్రామాలు, పెన్నా పరివాహక ప్రాంతాల పరిధిలోని అన్ని మండలాల్లో కంట్రోల్ రూంలు రాత్రిపూట కూడా పని చేయాలని తహసిల్దార్లను ఆదేశించారు. ఇప్పటివరకు తుపాను ప్రభావం వలన ఎలాంటి నష్టం వాటిల్లలేదని కలెక్టర్ చెప్పారు. ప్రజలు ఎవ్వరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తుఫాను ముప్పును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ భరోసా కల్పించారు. టెలీ కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ కార్తీక్, జిల్లాస్థాయి అధికారులు, ఆర్డీవోలు, సోమశిల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలే స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వాలను తీసుకుంటున్నారు


### మంత్రి పొంగూరు నారాయణ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తారని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్న ఆయన.. డివిజన్ అధ్యక్షులతో సమావేశమయ్యారు. మొదట డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. డివిజన్ల వారీగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. నెల్లూరును స్మార్ట్ సిటీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమంపై అధ్యక్షులతో చర్చించారు. ప్రజలే అడిగి మరీ సభ్యత్వాలు చేయించుకుంటున్నారని మంత్రి నారాయణ వెల్లడించారు. సభ్యత్వాలు తీసుకోవడం ద్వారా కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రమాదవశాత్తూ ఏమైనా ప్రమాదం జరిగితే.. పార్టీ తరపున బీమా వర్తిస్తుందని వెల్లడించారు. సభ్యత్వాల్లో స్పీడ్ పెంచాలని ఆయన సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పీటీసీ విజేత రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, ముఖ్యనేతలు హాజరయ్యారు.

## కృష్ణపట్నం సముద్రతీరం ఒడ్డుకు కోత

### అప్రమత్తమైన అధికారులు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావం మూలంగా ప్రజలు కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కృష్ణపట్నం సముద్ర తీర ప్రాంతం అల్లకల్లోలంగా ఉంది. సముద్రపు కెరటాలు ఎగిసిపడుతున్నాయి. ఈ మేరకు సముద్రపు అలలు తాకిడికి ఒడ్డు కోతకు గురికావడం జరిగింది. తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. సముద్రం అలలు ముందుకు వచ్చి ఉండడం గుర్తించారు. దీంతో అధికారులు అప్రమత్తమైనారు. తీర ప్రాంత గ్రామ ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరు కూడా బయటకు రావద్దని ఆయన తెలిపారు.

# పునరావస కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కోడూరు పంచాయతీ లోని రవీంద్రపురంలో వర్షాలకు ఇబ్బంది పడుతున్న చల్లా యానాదుల కుటుంబాలను శనివారం చెన్నపల్లి పాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ పునరావాస కేంద్రాన్ని శనివారం సాయంత్రం నెల్లూరు రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ నాగ సంతోష్ అనూష, తహసీల్దార్ టివిఎం కృష్ణ ప్రసాద్ విఆర్ఓ లక్ష్మయ్య రవి దర్శినితోపాటు సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. తుఫాన్ భారీ వర్షాలు దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం తీరప్రాంతంలో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరుగుతుందన్నారు. రెవిన్యూ అధికారులు పంచాయతీ సిబ్బంది మీడియా ప్రతినిధులు తమకు సహకరించడం పట్ల ధన్యవాదాలు



తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వారికి భోజన సదుపాయాలు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ నాయుడు మాట్లాడుతూ.. జనసేన పార్టీ ఆలోచనలకు ఆదేశాలకు ధీటుగా కష్టాలలో ఉన్న వారిని ఆదుకోవడం తమ ధర్మంగా ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో గిరిజనుల అభివృద్ధిపై స్పందించిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణి భవాని నాయుడు జన సైనికులు ఉన్నారు.

# ఫెంగల్ తుపాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఫెంగల్ తుపాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచించారు. శనివారం సాయంత్రం కలెక్టరు వారి క్యాంపు కార్యాలయం నుంచి భారీ వర్షాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రస్తుతం సోమశిలకు ఇన్ఫ్లో, ఔటఫ్లో సమానంగానే ఉన్నాయని ,భారీ వర్షాలు కురుస్తున్నందున అన్నమయ్య జిల్లా నుంచి సోమశిల జలాశయానికి వరద ప్రవాహం పెరిగితే పరిస్థితిని బట్టి నీటి విడుదలకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పెన్నానది పరివాహక ప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ అధికారులందరూ ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆత్మకూరు, కావలి, నెల్లూరు ఆర్డీవోలు సోమశిల ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సోమశిల నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తూ తదనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. సోమశిల ఎస్‌ఈ, ఈఈలు తమ సిబ్బందిని అందరిని అందుబాటులో ఉంచుకోవాలని, జలాశయంలో నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన కంట్రోలు రూమ్‌లు నెల్లూరు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంతో సమన్వయం చేసుకుని ప్రజలకు సహాయం అందించాలన్నారు. లోతట్టు ప్రాంతాలు ఎక్కడైనా ముంపుకు గురైతే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. తీరప్రాంత గ్రామాలు, పెన్నాపరివాహక ప్రాంతాల పరిధిలోని అన్ని మండలాల్లో కంట్రోల్ రూంలు రాత్రిపూట కూడా పనిచేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. ఇప్పటివరకు తుపాను ప్రభావం వలన ఎలాంటి నష్టం వాటిల్లలేదని కలెక్టర్ చెప్పారు. ప్రజలు ఎవ్వరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ భరోసా కల్పించారు. ఈ టెలీకాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, జిల్లాస్థాయి అధికారులు, ఆర్డీవోలు, సోమశిల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** డిసెంబర్ ఒకటి ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే నవంబరు 30నే ఒకరోజు ముందు గానే పింఛన్ల పంపిణీ జరుగుతుందని సైదాపురం మండలంలో 6537 పింఛన్‌లో ఉండగా అందులో 6338 పింఛన్లు శనివారం ఒక్కరోజే 96.96 పూర్తి చేసామని మిగతా బ్యాలెన్స్ 199 పింఛన్లకు డిసెంబర్ నెలలో పింఛను తీసుకోని వారికి జనవరి నెలలో రెండూ కలిపి ఇవ్వడం జరుగుతుందన్నారు. శనివారం తీసుకోలేని వారు ఆందోళన చెందాల్సిన పని లేదని సోమ, మంగళవారాల్లో యధావిధిగా పింఛన్ల పంపిణీ జరుగుతుందని సైదాపురం మండల ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఈ పింఛన్ కార్యక్రమంలో సైదాపురం పంచాయతీ సెక్రెటరీ ఇంద్రాణి సర్పంచ్ ఎందటి శారద కోలా రమేష్ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### తొలిరోజే నెల్లూరులో

## 92 శాతం పింఛన్ల పంపిణీ

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగుతోంది. మధ్యాహ్నం నాటికి 92 శాతం పింఛన్ లను పంపిణీ చేసినట్లు డిఆర్డిఏ పీడీ నాగరాజకుమారి అధికారికంగా శనివారం మధ్యాహ్నం వెల్లడించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని పొట్టేపాలెం సచివాలయం పరిధిలో పెన్షన్‌ల పంపిణీను పరిశీలించి స్వయంగా ఆమె లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. జిల్లా మొత్తంలో 3,07,795 పెన్షన్‌లకు గాను 2,82, 855 పెన్షన్‌లను బయోమెట్రిక్ ఐడెంటికేషన్ ద్వారా పంపిణీ చేసి 92 శాతం పూర్తి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.



## టౌన్ ప్లానింగ్ అధికారి పదవీ విరమణ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారిగా విధులు నిర్వహిస్తూ శనివారం పదవీ విరమణ చేసిన కొత్తపల్లి దశయ్యను కమిషనర్ సూర్యతేజ, ఇతర విభాగాల అధికారులు ఘనంగా సత్కరించారు. కార్పొరేషన్ కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు విధుల పట్ల దశయ్య కనబరిచిన క్రమశిక్షణను ప్రశంసించి, పదవీ విరమణ శుభాకాంక్షలను తెలియజేశారు. ఆత్మీయ పదవి విరమణ వేడుకల్లో అదనపు కమిషనర్ నందన్, ఆర్‌డిటివో మధుసూదన్, ఇంజనీరింగ్ ఎస్‌ఈ రామ్మోహన్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డిసిపి పద్మజ, ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు చక్రపాణి, శీనయ్య, లైసెన్సు టెక్నికల్ పర్సన్స్, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పరిశోధన పోటీలో మెడల్స్ గెలుపొందిన గురుకుల విద్యార్థులు



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** చేజర్ల మండలంలోని ఆదూరుపల్లి ఉన్న డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల జాతీయస్థాయి పరిశోధనా పోటీ కళారంగ్ పోటీ పరీక్షలలో ముగ్గురు విద్యార్థినులకు మెడల్స్ ప్రధానం చేశారు. ఆగస్టు 29వ తేదీ నిర్వహించిన జాతీయస్థాయి పరిశోధన పోటీ పరీక్షలలో ఆదూరుపల్లి డా.అంబేద్కర్ గురుకుల పాఠశాల నుంచి 85 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ముగ్గురికి మెడల్స్, పోటీలో పాల్గొన్న మొత్తం విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేసినట్లు గురుకుల ప్రిన్సిపాల్ శైలజ కుమారి తెలిపారు. అలాగే కోఆర్డినేటర్ కే.శ్యామకుమారి, ప్రిన్సిపల్ శైలజ కుమారికి సర్టిఫికెట్లను ప్రదానం చేసినట్లు తెలిపారు.

## కారు అద్దాల ధ్వంసంపై కేసు నమోదు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని పాత సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పార్కింగ్ చేసిన కారు అద్దాలను ధ్వంసం చేసిన విషయమై కేసు మోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ స్థానిక ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకుడిగా పని చేస్తున్న ఎ.రమణయ్య తన కారును పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో పార్కింగ్ చేశాడన్నారు. శుక్రవారం షేక్ జిలానీ అనే వ్యక్తి ఉద్దేశ్యపూర్వకంగా రాళ్లతో కారు అద్దాలను ధ్వంసం చేసినట్లు రమణయ్య ఫిర్యాదు చేశాడన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు జిలానీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## అధిక వర్షాలకు రైతులకు సూచనలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతంకురుస్తున్న వర్షాలకు రైతులకు వ్యవసాయధికారి ఆంజనేయులు నాయక్ రైతులకు పలు సూచనలు చేశారుమండలంలో ముందుగా వేసిన వరి కోత దశలో, రబీలో వేసిన వరి పిలక దశలో ఉన్నది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సూచించిన విధంగా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కురుస్తున్న వర్షాలకు పంట నష్టం కనుక జరిగినట్లయితే గ్రామ స్థాయిలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులకు రైతులు తెలియపరచాలి.



# మాతా శిశు మరణాలు జరగకుండా అరికట్టాలి

## అధికారులకు డిఎంహెచ్ఓ సూచన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మాత మరణాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ.పెంచలయ్య సూచించారు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన మాతాశిశు మరణాల సబ్ కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2024 గత అక్టోబర్ నెలలో సంభవించిన 2 మాతృమరణాలు, 6 శిశు మరణాలకు గల కారణాలు, లోపాలు గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ప్రతి గర్భిణీ స్త్రీని గుర్తించి త్వరితగతిన నమోదు చేయాలని, అన్నీ రకాల పరీక్షలు తప్పని సరిగా చేయాలని హై రిస్క్ గర్భిణీ స్త్రీలను గుర్తించి సదరు గర్భిణీ స్త్రీలకు ఎటువంటి ఆటంకం లేకుండా సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పించి ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖ ప్రసవం జరిగే వరకు సంబంధిత ఆరోగ్య పర్యవేక్షకురాలుకు పూర్తి భాధ్యత అప్పగించవలసిందిగా వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు జరిగేలాగా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని, అర్హులైన ప్రతి గర్భిణీ స్త్రీకి, బాలింతకు జెఎస్‌వై అండ్ జెఎస్ ఎస్‌కె పథకాలు క్రింద లబ్ధి చేకూరేలాగా చూడాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. ఏ తల్లి, బిడ్డ కూడా రక్తహీనత వలన, సకాలంలో వైద్య సేవలు అందక మరణించినట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత వైద్య ఆరోగ్య సిబ్బంది పైన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఎల్ఏటిఓ డాక్టర్ షేక్ ఖాదర్ వలీ, ప్రొఫెసర్ (గైనిక్) జిజిహెచ్ డాక్టర్ ఇందిర, డిఐఓ డాక్టర్ ఏ.ఉమామహేశ్వరి, పిఓ (ఎఫ్‌పిసి) డాక్టర్ పిఎల్ దయాకర్, జిజిహెచ్ పిడియాట్రీషన్ డాక్టర్ చిరంజీవి, జిజిహెచ్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ సింధు, డెమో కె.కనకరత్నం, డిపిహెచ్ఎన్ఓ జి.మంజుల, ఎన్ఓ శ్రీమతి సహన, ఏఎస్ఓ రమేష్, సంబంధిత వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి : ఆదాల



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఫెంగల్ తీవ్ర తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని ప్రజలందరూ ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు పార్లమెంట్ నియోజక వర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలందరు తుఫాన్ తీవ్రత పట్ల అవగాహన కలిగి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ ఎంపీ ఆదాల సూచించారు. తుఫాను సమయంలో తీవ్రమైన పెనుగాలులు ఇచ్చే అవకాశం పిడుగులు పడే ప్రమాదం ఉందన్న అధికారుల హెచ్చరికల నేపథ్యంలో పశువుల కాపరులు, రైతులు, అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రకటనలో తెలియజేశారు. తప్పని పరిస్థితిలో అవసరమైతే తప్ప ఎవరు కూడా బయటికి వెళ్లకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని మాజీ మంత్రి ఆదాల సూచించారు. తీవ్రమైన గాలులు తుఫాను నేపథ్యంలో ఎటువంటి ప్రమాదం సంభవించిన, విపత్కార పరిస్థితులు తలెత్తిన వెంటనే జిల్లా అధికార యంత్రాంగం కు సమాచారం అందించి అవసరమైన సహాయక చర్యలను పొందాలని ఆదాల ప్రభాకర్ రెడ్డి ప్రజలను కోరారు. జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు.

# ఆరో నెంబర్ ప్రమాదపు హెచ్చరిక జెండా ఎగురవేత

## భయబ్రాంతులకు గురైన తీర ప్రాంత ప్రజలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన పెంగల్ తుఫాను ప్రభావం తీర ప్రాంతంపై బాగానే చూపింది. శనివారం తెల్లవారుజాము నుంచి వర్షపాతం ఎక్కువగా నమోదయింది. ఈ తుఫాను వల్ల ప్రమాదం ఉంటుందని తుఫాను విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేస్తూ కృష్ణపట్నం పోర్టులో ఆరో నెంబర్ ప్రమాదపు హెచ్చరిక జెండాను ఎగరవేసింది. దీంతో తీర ప్రాంత ప్రజలు భయబ్రాంతులకు గురైనారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు తుపాను ప్రభావం చూపింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జనం ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ అధికారులు ఎప్పటికప్పుడు తుఫాను విషయం తెలుసుకుంటూ గ్రామీణ ప్రాంతాలను అప్రమత్తం చేశారు. రెవెన్యూ శాఖ అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం ముత్తుకూరు మండలంలో 28.6 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదయింది. ఈ విషయాన్ని మండల తాసిల్దారు వాట్సాప్ గ్రూప్ ద్వారా మీడియాకు తెలియజేసినారు. కురిసిన భారీ వర్షాలతో జనజీవనం స్తంభించి కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. అయితే చిన్నపాటి చలి గాలులు వీసినాయి. కృష్ణపట్నం సముద్ర తీర ప్రాంతం కు తాసిల్దార్ బాలకృష్ణారెడ్డి వెళ్లి సముద్రం కెరటాలు ఏ స్థాయిలో ఉండాయి అనే విషయం పై తెలుసుకున్నారు. అదేవిధంగా పోలీస్ శాఖ యంత్రాంగం కూడా అప్రమత్తంగా ఉండింది.

# స్వామికి విశేష పుష్పాలంకరణ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీకమాస ఆకాశదీపం ముగింపు కార్యక్రమం నిర్వహించినారు. కార్తీకమాసం పురస్కరించుకుని నెల్లూరు శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి విశేషంగా పుష్పాలంకరణ చేసినారు. పుష్పాలంకరణలో స్వామి అమ్మవారిని చూడదానికి భక్తులు అధికముగా వేంచేసినారు.స్వామి వారికి చేసిన పుష్పాలంకరణ చూసి భక్తులు తరించినారు. స్వామి అమ్మవార్లకు దీపహారతులు ఇచ్చినారు. అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. స్వామి అమ్మవార్ల అలంకరణ ఆనం రామనారాయణ రెడ్డి, శిరీష వారిచే నిర్వహించారు. రాత్రి స్వామి వారికి ఘనంగా ప్రాకారోత్సవం నిర్వహించినారు. ఈ కార్యక్రమమునకు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసరావు, ఆల్తూరు గిరీష్‌రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి (కేసీఆర్), ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో చేజర్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తిరుమల రావు ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు. చేజర్ల మండల ప్రజలందరూ తుఫాన్ తీవ్రత పట్ల అవగాహన కలిగియుండి తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని, తుఫాను సమయంలో తీవ్రమైన పెనుగాలులు ఇచ్చే అవకాశం పిడుగులు పడే ప్రమాదం ఉంది కాబట్టి పశువుల కాపరులు, రైతులు, మరి ముఖ్యంగా పెన్నానది ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు, గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లల తల్లులు, వయో వృద్దులు ఇల్లు విడిచి బయటకు రావద్దన్నారు. రెవెన్యూశాఖ అధికారులు సిబ్బంది గ్రామ సచివాలయం వద్ద అందరికీ అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా ఫోన్ 9440700008 నెంబర్‌కి కాల్ చేయాలనీ సూచించారు.

# తీరప్రాంతాల్లో పర్యటించిన కొండ్రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఫెంగాల్ తీవ్ర తుఫాను నేపథ్యంలో శనివారం నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సముద్ర తీర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను స్వయంగా కలుసుకొని తీవ్ర తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరు కూడా అవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావద్దని, ఎటువంటి ఇబ్బంది కలిగిన వెంటనే అధికారులకు సమాచారం అందించి సహాయక చర్యలు పొందాలని విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తీర ప్రాంతంలోని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ముందుస్తుగా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ



**కొడవలూరు, మేజర్‌న్యూస్ :** నార్త్ రాజుపాలెం గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపుమేరకు వేకువజామున ఐదు గంటల నుండి తెలుగుదేశం పార్టీ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందిపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి కరకటి మల్లికార్జున పాటూరు రమేష్ ఆధ్వర్యంలో నార్త్ రాజుపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ సచివాలయ సిబ్బందితో కలిసి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అవ్వ తాతలకు ఒంటరి మహిళలకు వికలాంగులకు వితంతువులకు సామాజిక భద్రత పెన్షన్ ఇవ్వడం జరిగిందని సభ్యత్వ నమోదు కొరకు తద్వారా వచ్చే అవకాశాలు ఏవైతే ఉన్నాయో వాటిని వివరించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మందిపాటి రమణారెడ్డి, ఇరువురు యోగానంద రెడ్డి, పోసిరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి, మయూరి సిద్దార్థ, బాబి, ఆరే విల్సన్, కరకటి సోము, గున్నం రమణయ్య, అన్నం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు పెన్షన్ నగదు పంపిణీ

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కోవూరు పల్లి పంచాయతీ ఇన్చార్జ్ కార్యదర్శి రాజేంద్ర ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజాము నుంచే లబ్ధిదారులకు పెన్షన్ నగదును పంపిణీ చేశారు. ఎన్టీఆర్ భరోసా కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు ద్వారా పింఛన్ నగదు అందజేశారు. డిసెంబర్ 1'వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు అర్హులైన వారి ఇంటి వద్దకే పెన్షన్ నగదు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాటకరాని రంగయ్య సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# జోరు వానలో పింఛన్లు పంపిణీ : జనసేన గునుకుల విజయలక్ష్మి



**నెల్లూరు నగరం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు సిటీ 16వ డివిజన్ గుర్రాల మడుగు సంఘం, జోరు వానలో సైతం ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేసిన జనసేన నాయకురాలు గునుకుల విజయలక్ష్మి. ఆమె మాట్లాడుతూ.. పేదలకు అందాల్సిన కోట్ల రూపాయల రేషన్ బియ్యం అలవాటైన అధికారుల వైఖరితో దేశం మరలి పోతుంటే, ఇది దేశద్రోహమేనని ఆపిన నాయకుడు పవన్ కళ్యాణ్ అవినీతి రహిత సమాజం కోసం శ్రమిస్తున్నారని విజయలక్ష్మి అన్నారు. అర్హులైన పేదలకు ఇల్లు ఇస్తూ స్వయం ఉపాధి కింద ప్రభుత్వ సహకారంతో దుకాణాలు ఇప్పించి ఎవరి కాళ్ల మీద వారు నిలబడేటట్లు చేస్తున్న మన పొంగూరు నారాయణ అభివృద్ధికి రోల్ మోడల్‌గా నెల్లూరు సిటీని తయారు చేస్తారు.. అనడంలో సందేహం లేదు. మహిళా సాధికారతకు మారుపేరు పొంగూరి రమాదేవి సిటీలోని మహిళలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కుటుంబ సభ్యులు కూడా చూసుకుంటున్నారు. వారి నాయకత్వం మాకు అందరికీ ఆదర్శం అని కొనియాడారు. అభివృద్ధి సాధిస్తే పేదరికం అధికమించి రాష్ట్ర ప్రగతి సాధించగలం ఇదే కూటమి లక్ష్యం. డిసెంబర్ 1న ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే శనివారం ఉదయం 7 గంటలకు నెల్లూరు మున్సిపల్ శాఖ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ, వారి భార్య తెలుగు దేశం నాయకురాలు రమాదేవి సూచనతో 16 డివిజన్, గుర్రాల మడుగు సంఘంలో జనసేన వీర మహిళ గునుకుల విజయలక్ష్మి పింఛన్లు పంపిణీ చేసారు. సచివాలయం సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికి పింఛన్ అందజేసి మనది మంచి ప్రభుత్వం. మాటకి కట్టుబడి సూపర్ సిక్స్ పథకాల అమలు చేస్తున్న వైనాన్ని వారికి వివరించారు. అర్హులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందాయా లేదా సరిచూసుకోవాలని, ఏదైనా ఇబ్బంది ఉంటే తెలపాలని కోరారు. ఇల్లు లేని వారికి మంత్రి నారాయణ ఆధ్వర్యంలో కొత్తగా అప్లై చేసుకునేందుకు అలాగే స్థలం గల వారికి ఇంటి లోన్లు అప్లై చేసుకునే విధానాన్ని కూడా వారికి వివరించారు. గత వైసిపి ప్రభుత్వాలు రేషన్ కార్డులు విషయంలో నిర్లక్ష్యం చేశారో వారిలో అర్హులైన వారికి కొత్తగా రేషన్ కార్డు అప్లై చేసుకునే అవకాశాన్ని కూడా మన ప్రభుత్వం కలుగ చేసిందని వారికి వివరించారు. డివిజన్లో ప్రజలకు అందుబాటులో ఉంటానని ఏదైనా సమస్య వస్తే తనకు స్వయంగా కాల్ చేస్తే పరిష్కారానికి పరిష్కార మార్గాలను చూపిస్తానని తెలిపారు. ప్రజలందరి మద్దతుతో కూటమి ప్రభుత్వం నెల్లూరు సిటీ పొంగూరు నారాయణ అత్యధిక మెజారిటీతో గెలిచారని రానున్న రోజుల్లో ప్రజల మద్దతు అలాగే కొనసాగాలని కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన వీర మహిళ విజయలక్ష్మి, తెలుగుదేశం నాయకురాలు లక్ష్మీకుమారి, జనసేన సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, కార్పొరేషన్ సెక్రటరీ హేమచంద్ర యాదవ్, యాసిన్,షేక్ షబ్బీర్, ఫిరోజ్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

# తమ స్థలాన్ని కాపాడాలని జెనసేన గునుకుల కిషోర్‌కి విజ్ఞప్తి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మాకు హక్కులు కలిగి ఉన్న తమ స్థలం నుఆక్రమణ దారుల నుంచి కాపాడాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌కి కలువాయి మండలం భాధితుల విజ్ఞప్తి చేశారు. కలువాయి మండలంలో గత ఏడేళ్లుగా నివాసితులు అక్రమ ఆక్రమణదారుల వేధింపులకు గురవుతున్నారు. దశాబ్దాల క్రితం ప్రభుత్వం నివాసితులు ప్రభుత్వం కేటాయించిన రెండు ఎకరాల భూమిని కొంతమంది అక్రమార్కులు వైసీపీ నేతల సహకారంతో అక్రమంగా స్వాధీనం చేసుకున్నారు. మండల రెవెన్యూ అధికారి, సబ్ ఇన్స్పెక్టర్‌లను న్యాయం కోసం అనేకసార్లు కలిసినా, బాధితులకు ఎటువంటి పరిష్కారం లభించలేదని బాధిత వ్యక్తులు తమ పరిస్థితిని వివరిస్తూ జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రత్యేకించి ఇప్పటికే కోర్టు భూసమస్యపై నోటీసులు జారీ చేసినా చర్యలు లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని అయినప్పటికీ, ఆక్రమణదారులు కోర్టు తీర్పును బేఖాతరు చేస్తూనే ఉన్నారని చెప్పారు. ఈ విషయం పై గునుకుల కిషోర్ స్పందిస్తూ స్థానిక మండల రెవెన్యూ అధికారికి ఫోన్ చేసి కోర్టు తీర్పును బేఖాతరు చేస్తున్న ఆక్రమణదారులపై తక్షణమే రెవెన్యూ నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక కలువాయి మండల నాయకుడు మనోహర్‌తో కలిసి వచ్చిన బాధితులకు జనసేన పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తమ భూమిని అక్రమార్కుల నుంచి కాపాడి తమకు సరైన న్యాయం జరిగే వరకు పార్టీ జిల్లా నాయకులు తమకు అండగా ఉంటారని హామీ ఇచ్చారు.

# వైసీపీ నాయకులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు కోటమిట్ట షాదీ మంజిల్‌లో వైఎస్ఆర్సిపి నాయకులు అబ్దుల్ మస్తాన్ అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవడంతో పేదలకు అన్నదాన కార్యక్ర మాన్ని శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి మాట్లాడుతూ.. అబ్దుల్ మస్తాన్ అనారోగ్యం నుంచి కోలుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అబ్దుల్ మస్తాన్ గారు అనారోగ్యం నుంచి కొల్కొన్న వెంటనే పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం.. వారి సేవా గుణానికి నిదర్శమని తెలిపారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించే అవకాశం అబ్దుల్ మస్తాన్‌కి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కరిముల్లా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హంజా హుస్సేని, వైసీపీ నాయకులు షేక్ సిద్దిక్, షేక్ మీరా మొహిద్దీన్, షేక్ మున్వర్, అతహార్ భాయ్, షేక్ యస్దానీ, తదితరులు పాల్గొన్నారు.





# లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**కందుకూరు, మేజర్‌న్యూస్ :** మాలకొండలో శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించిన ఆలయ అధికారులు. ఈ సందర్భంగా ఆలయ ఈవోతో ఆలయ అభివృద్ధి, భక్తులకు అందుతున్న సౌకర్యాలు, ఏర్పాట్లు, ఇతర అంశాలపై మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అన్నదాన సత్రం వద్ద భక్తులకు అందుతున్న భోజన సదుపాయాలను పరిశీలించి, కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పట్టణ టీడీపీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ముందస్తుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండలం బ్రహ్మదేవంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో నాగలక్ష్మి పర్యవేక్షణలో తిరుపతి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి రమేష్ కుమార్ విజయవంతంగా నిర్వహించారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపుమేర ఈ పింఛన్ల కార్యక్రమాన్ని తుఫాను సైతం లెక్కచేయకుండా నిర్వహిస్తున్నారని ఎంపీడీవో నాగలక్ష్మి అన్నారు. ముందస్తుగా ఇంటింటికి వెళ్లి అవ్వ తాతల ఒంటరి మహిళలకు వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కొత్తపల్లి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జరగడం గమనించిన ఎంపీడీవో ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలూరి వెంకట విష్ణువర్ధన్ రావు, కొత్తపల్లి మహేష్, బొబ్బేపల్లి అంకయ్య, దాసరి శ్రీనివాసులు, బద్రి అలియాస్ మైపాటి రవి, తంబి రామయ్య, షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

# 91శాతం పెన్షన్లు పంపిణీ



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** విడవలూరు మండలంలోని 15 పంచాయతీలలో సామాజిక పెన్షన్లను శనివారం 91శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో నగేష్ కుమారి తెలిపారు. ఉదయం 5గంటల నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియను తన పర్యవేక్షించినట్లు తెలిపారు. అంతేకాకుండా తాను స్వయంగా పెన్షన్లు అందించి లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించటం జరిగిందన్నారు. మండలంలో 7068 పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 6412 పెన్షన్లు అందజేశామన్నారు. మిగిలిన వారికి సోమవారం రోజున పెన్షన్లు అందజేస్తామన్నారు. ఆ రోజు కూడా పొందలేక పోతే తదుపరి నెల రెండు నెలల పెన్షన్ పొందవచ్చును అన్నారు.

# ముగ్గురు మృతుల కుటుంబాలకు కంచి ఆర్థికసాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఇటీవల మృతిచెందిన ముగ్గురి కుటుంబాల వారికి శనివారం జోరువర్షం కూడా లెక్కచేయ కుండా నిత్యాన్నదాత, శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచిపరమేశ్వరరెడ్డి 10వేల రూపాయలవంతున 30వేల రూపాయలను అందజేశారు. గత 15నెలల క్రితం ఆత్మకూరు లోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఔట్‌పేషెంట్లు, వారి సహాయకులు, ఇన్‌పేషెంట్ల సహాయకులు దాదాపు ఆరేడువందల మందికి ప్రతినిత్యంత ఉచితం అత్యంత రుచికరమైన భోజనాన్ని సమకూరుస్తున్న పరమేశ్వరరెడ్డి ఈ కార్యక్ర మాన్ని ఆజన్మాంతం నిర్విరామంగా కొనసాగి స్తామని ప్రకటించి అందుకుగాను హాస్పిటల్ ప్రాంగణంలో దాదాపు 65లక్షల రూపాయలతో భవనం కూడా స్వంతనిధులతో నిర్మించారు. దాంతోపాటు ఆయన సామాజికసేవా కార్యక్ర మాలు తమ స్వంత గడ్డపై అందించాలని ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఎవరు మృతి చెందినా ఆ కుటుంబానికి 10వేల రూపాయల వంతున స్వంత నిధులు అందించేలా గత 8నెలలక్రితం ప్రారంభించి కొనసాగిస్తున్నారు. ఆయన స్వంత నిధులతోనే ఒక కైలాస రథయాత్ర వాహనాన్ని, నాలుగు శవశీతల పేటికలను కూడా సమకూర్చారు. నిత్యం జనాలు ఇబ్బందిపడుతున్న దృష్ట్యా ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండువద్ద, నెల్లూరు -ముంబాయి జాతీయ రహదారిపై నెల్లూరు పాళెం కూడలి వద్ద తాగునీటిసరఫరా కేంద్రాల ను ఏర్పాటు చేశారు. తాజాగా ఇటీవల మృతి చెందిన 12వ వార్డు పరిధిలోని ఒంగోలు సరస్వతి కుటుంబాన్ని, 13వ వార్డు పరిధిలో పాటూరు పెంచలయ్య కుటుంబాన్ని, 19వవార్డు పరిధిలోని శిలి పెంచలయ్య కుటుంబాన్ని కంచి పరమేశ్వరరెడ్డి ప్రతినిధులు పరామర్శించి ఆ కుటుంబాలకు 10వేల రూపాయల వంతున ఆర్థికసాయాన్ని అందజేశారు. కంచి పర మేశ్వరరెడ్డి అందిస్తున్న సామాజికసేవలు అమోఘం, అత్యంత ప్రయోజనకరం, అభినం దనీయం అని సర్వత్రా కొనియాడుతున్నారు. ఆర్థికసాయమందుకున్న మృతుల కుటుంబాలవారు పరమేశ్వరరెడ్డి సేవానిరతిని కొనియాడి ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కుడుముల సుధాకర్‌రెడ్డి, మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులకు ప్రత్యేక సంక్షేమకార్యక్రమాలు అమలుచేయాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రంగస్థల, జానపద, పండరిభజనల, తోలుబొమ్మలాటల, వీధిభాగ వతం కళాకారుల సంక్షేమాన్ని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని ఆత్మకూరు ప్రాంతంలోని కళాకారుల సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. గత ప్రభుత్వం వద్ద ఎంతగా మొరపెట్టుకున్నా వృద్ధకళాకారులకు పెన్షన్లు, ఆర్టీసీ బస్సుల్లో రాయితీ, కళాకారులకు గుర్తింపుకార్డుల మంజూరు, దేవాలయాల్లో, ఆధ్యాత్మిక కేంద్రాల్లో ప్రదర్శనలకు అవకాశం ఇవ్వకపోగా రంగస్థల వృత్తికళాకారులకు బ్రతుకుదెరువుగా ఉన్న చింతామణి నాటక ప్రదర్శనను నిషేధించారని వారు ఆవేదనతో తెలిపారు. గతంలో 15 సంవత్సరాల క్రితం నెల్లూరు జిల్లాలో 560మందికి మాత్రమే వృద్ధకళాకారుల పెన్షన్ మంజూరు చేశారని, అనంతరం ఎంతగా మొరపెట్టుకున్నా 60సంవత్సరాలు దాటిన అర్హులు వందలాదిమంది ఉన్నా వారికి పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. చింతామణినాటక ప్రదర్శనపై విధించిన నిషేధం రద్దుచేయాలని అరిచిగీపెట్టినా గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోనకుండా పెడచెవినపెట్టిందన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డులంటూ దరఖాస్తున్న స్వీకరించిన గత ప్రభుత్వం కార్డులివ్వనేలేదన్నారు. వయసుమీరిన అర్హులైన కళాకారులకు పెన్షన్లు మంజూరుచేయాలన్నా జిల్లా పౌరసంబంధాల శాఖకు దరఖాస్తులు చేసే అవకాశం కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదని వారు ఆవేదనతో తెలిపారు. గుర్తింపు కార్డులుంటే ఏదేని ప్రదర్శనలకు వెళ్ళే సమయంలో ఎవరూ అడ్డుకొనకుండా ఉంటుందని భావించినా ఆకార్డులు ఇవ్వలేదన్నారు. ప్రదర్శనల కోసం వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేయాల్సి ఉన్నందున ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని కూడా కోరినా పట్టించుకోలేదన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా కళాకారుల వృత్తి ప్రాధాన్యతగా అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని, అందరు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలని, ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని, కళాప్రదర్శనలనే వృత్తిగా నమ్ముకొని సరైన అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నందున కళాకారుల ప్రదర్శనలకు దేవాలయాలు, ధార్మికసంస్థల్లో అవకాశం కల్పించాలని వారు నేటి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తాము ప్రజలమేనని, ఓటర్లమేనని, తాము కూడా ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నామని, అన్నివర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేస్తున్న ప్రభుత్వం కళాకారులను కూడా ఆదుకోవాలని, తమ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

# మండల అభివృద్ధికి సహకరించండి : ఎంపీపీ




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండల అభివృద్ధికి అధికారులు ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ బోయిళ్ళ పద్మజా రెడ్డి తెలిపారు. శనివారం అనుమ సముద్రంపేట మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఎంపీపీ బోయళ్ళ పద్మజా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో విద్యా, వైద్య, గృహ నిర్మాణం, వ్యవసాయం, జలవనరులు, త్రాగునీరు, పారిశుధ్యం, నెడ్ క్యాప్, ఐసిడిఎస్ ఎంజిఎన్ఆర్ఈజిఎస్ శాఖలపై సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయా శాఖలపై జరుగు తున్న అభివృద్ధి పనులు ప్రభుత్వం నుండి అంది స్తున్న సేవలు గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోయళ్ళ పద్మజా రెడ్డి మాట్లాడుతూ.. మండల అధికారులు ప్రజాప్రతి నిధులు మండల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ప్రసన్న కుమారి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పిఆర్ఏఈ ఖాదర్ మస్తాన్ ఉపాధి హామీ ఎపిఓ సునీల్ కుమార్ చిరమన ఏఎస్పేట వైద్యాధి కారులు జ్యోతి రాణి మంజులమ్మ ఎంఈఓ డి.సాయిప్రసాద్ ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయలక్ష్మి కస్తూరి హౌసింగ్ ఏఈ వివేక్ మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ సందాని భాష వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో 91శాతం పెన్షన్ల పంపిణీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో శనివారం సాయంత్రానికి 91శాతం మందికి పెన్షన్ల పంపిణీ జరిగిందని స్థానిక ఎంపిడివో పి.ఐజాక్‌ప్రవీణ్ పేర్కొన్నారు. ఆయన మహిమలూరులో పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించారు. మండలంలో 4871మంది వివిధ రకాల పెన్షనర్లుండగా 4427 మందికి సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ పూర్తయిందని, మిగతావారికి డిసెంబర్ 2వ తేదీన పంపిణీ చేస్తామని ఎండివో వివరించారు. 1వతేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వ ఆదేశాలమేరకు ముందుగానే శనివారం నాడు పెన్షన్లను ఇంటింటా పంపిణీ చేయించామని ఎండివో ఐజాక్‌ప్రవీణ్ పేర్కొన్నారు.

తుఫాన్ ప్రభావంతో

## అధికారులను అప్రమత్తం చేసిన ఆర్డీఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తుఫాన్‌ప్రభావంతో వర్షాలు అధికంగా కురుస్తుండడంతో ఆత్మకూరు డివిజన్‌లో అందరు అధికారులు, తీరప్రాంతవాసులు తదితరులందరినీ స్థానిక ఆర్డీవో అప్రమత్తం చేశారు. గత 3రోజులుగా ఆర్డీవో కార్యాలయంలో, అన్ని మండల తహశీల్దారు కార్యాలయాల్లో అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు కంట్రోల్‌కేంద్రాలను ఏర్పాటు చేయించారు. ఆమె నిరంతరం పర్యవేక్షిస్తూ తుఫాన్ ప్రభావంతో ఎలాంటి నష్టాలు లేకుండేలా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండేలా చర్యలు చేపట్టామని ఆర్డీవో పావని పేర్కొన్నారు. పెన్నాపరీవాహనక ప్రాంతగ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని, లోతట్టు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, అవసరమైతే సురక్షితప్రాంతాలకు తరలించేందుకు, తుఫాన్‌షెల్టర్ కేంద్రాలు ఏర్పాటుకు సిద్ధంచేశామన్నారు. ప్రజలు కూడా వర్షాలను గమనించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యసమస్యలు తలెత్తకుండేలా జాగ్రత్తలు పాటించాలని, ఏదేని ఇబ్బంది కలిగితే వెంటనే తమ దృష్టికి తేవాలని ఆర్డీవో కోరారు. తుఫాన్ తగ్గేంతవరకు విఆర్వోలు, ఇతర గ్రామస్థాయి ఉద్యోగులు ఆయా గ్రామాల్లోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆర్డీవో పావని సూచించారు.

## స్కూల్ వాహనాలను నిబంధనలమేరకు నడపాలి

**ముమ్మరంగా ఫిట్‌నెస్ పరీక్షలు : ఎంవీఐ పి.రాములు**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పాఠశాలల వాహనాలను తుచతప్పకుండా నియమావళి మేరకు నడపాలని ఆత్మకూరు మోటార్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ పి.రాములు పేర్కొన్నారు. ఆయన జిల్లా డిటిసి ఆదేశాలమేరకు మండలంలోని పాఠశాలల, కళాశాలల వాహనాలను నిశితంగా పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. వాహనా డ్రైవర్ల విధులను పరిశీలించారు. ఆయనే స్వయంగా వాహనాలను నడిపి కండిషన్ పరిశీలించారు. విద్యార్థులనడిగి వాహనాల రవాణా, డ్రైవర్ల విధుల నిర్వహణ తదితర అంశాలను గురించి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రాములు మాట్లాడుతూ వాహనాలను కండిషన్‌లో ఉంచాలని, అర్హులైన వారినిమాత్రమే డ్రైవర్లుగా నియమించుకోవాలని, రవాణా చట్టాలను సక్రమంగా పాటించాలని, ట్రాఫిక్ నియమావళిని అనుసరించాలని, డ్రైవర్లు మద్యం సేవించి కానీ, సెల్‌ఫోన్లు మాట్లాడుతూకానీ వాహనాలను నడపరాదని, ప్రశాంతతతో వాహనాలను నడిపి సురక్షితంగా విద్యార్థులను గమ్యం చేర్చాలని ఎంవీఐ సూచించారు. ఫిట్‌నెస్‌లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు ఆగినతరువాత జాగ్రత్తగా ఎక్కాలని, దిగాలని చెబుతూ తగిన అవగాహన కల్పించడంతోపాటు వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలను నిర్లక్ష్యంగా నడిపి పసిపిల్లల ప్రాణాలతో చెలగాటమాడే డ్రైవర్లపై చర్యలు అత్యంత కఠినతరంగా ఉంటాయని రాములు హెచ్చరించారు.

# యువతి కాలినడక కోయంబత్తూర్ నుండి అమరావతి వరకు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఈ ఫోటోలో కనిపిస్తున్న ఆడబిడ్డ పేరు భారతి, సొంత ఊరు విజయనగరం జిల్లా, 15ఏళ్ల క్రితం వీరి తల్లిదండ్రులు ఉపాధి కోసం తమిళనాడులోని కోయంబత్తూర్‌కి వెళ్లి స్థిరపడినారు. దురదృష్టవశాత్తు కరోనాలో వీరి తండ్రి గారు తర్వాత వీరు తల్లిగారు పరమపదించారు. ప్రస్తుతం ఈమె కోయంబత్తూర్‌లోని స్పిన్నింగ్ మిల్లులో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మీద ఉన్న ప్రేమ, అభిమానంతో ఆయన గెలిస్తే, ఆంధ్ర రాష్ట్రం బాగుపడుతుంది అనే ఉద్దేశంతో ఉండినది. ఆయన గెలిచిన తర్వాత కాలినడకన కోయంబత్తూరు నుండి మంగళగిరి వరకు చేరుకొని పవన్ కళ్యాణ్‌ని కలిసి తెలుగు ప్రయాణంలో తిరుపతికి వెళ్ళి వెంకటేశ్వర స్వామిని దర్శించి కోయంబత్తూరు వెళ్ళాలని సంకల్పించుకున్నది. ఈ క్రమంలో ఆమె కోయంబత్తూర్ నుండి 900 కిలోమీటర్లు నడిచి మంగళగిరి చేరుకున్నది. కానీ దురదృష్టవశాత్తు పవన్ కళ్యాణ్ లేరు. ఎన్నికల ప్రచారం కోసం మహారాష్ట్ర వెళ్లారని తెలుసుకొని తిరిగి రావడానికి సమయం పడుతుందని తెలుసుకొని, మంగళగిరిలోని పార్టీ ఆఫీస్ వారి సహాయంతో తిరుగు ప్రయాణమై తిరుపతి వెళ్లి స్వామివారిని దర్శించుకుని, తిరిగి మంగళగిరి వెళ్లి పవన్ కళ్యాణ్‌ని కలవాలని ఆమె కోరిక. ఈ క్రమంలో ఆమె కాలనీ నడకన వస్తున్నది అని తెలుసుకున్న జనసేన నాయకుడు కాకు మురళి రెడ్డి పార్టీ ఆఫీసుకు తెలిపారు. నెల్లూరు జిల్లా జనసేన నాయకులు వీర మహిళలు, సింహపురి హాస్పిటల్ వద్దకు వెళ్లి, ఆమెను వీర మహిళలు నందిని, వరలక్ష్మి, ప్రసన్న స్వాగతించగా జనసేన నెల్లూరు జిల్లా నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, శ్రీరామ్ అడ్వకేట్, కృష్ణారెడ్డి, రవికుమార్ వేటూరి, గుడి హరిరెడ్డి, జనసేన పార్టీ ఆఫీస్ ఇన్చార్జి జమీర్, గుర్రం కిషోర్, పేనేటి శ్రీకాంత్, ప్రశాంత్ రామ్ కాకు మురళి రెడ్డి, పవన్ యాదవ్, ఆమెను సత్కరించి నెల్లూరు జిల్లా పార్టీ ఆఫీసుకు తీసుకొని వచ్చి ఆమెకు భోజన వసతులు కల్పించారు. ఈ క్రమంలో ఆమె తిరుపతికి వెళ్లి అక్కడి నుంచి మంగళగిరి వెళ్లే దానికి కావలసిన ఆర్థిక సహాయం నూనె మల్లికార్జున యాదవ్, కాపు మురళి రెడ్డి, అందించినారు. నెల్లూరు నుండి తిరుపతికి సాగనంపుతూ తిరుపతిలో కూడా ఆమెకు సహాయపడాలని అక్కడి జనసేన నాయకులకు తెలిపారు. ఆమె ప్రయాణం ప్రశాంతంగా జరగాలని ఆమె పవన్‌కళ్యాణ్‌ని కలుసుకొని తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని కోరుకుంటున్నారు.

# అయ్యప్ప స్వామి పడిపూజకు కంచి విరాళం




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు శివాలయంలో డిసెంబర్ 22వ తేదీన ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి పడిపూజ ఖర్చు 2,62,400 మొత్తాన్ని అయ్యప్ప స్వామి సేవా సమాజం – ఆత్మకూరు అయ్యప్ప స్వాములకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నిత్యాన్నదాత, కంచి పరమేశ్వర రెడ్డి ట్రస్టు సభ్యుల ద్వారా విరాళాంగా శనివారం అందజేయడం జరిగింది.
డిసెంబర్ 16వ తేదీన ఆత్మకూరు అయ్యప్ప స్వామి సేవా సమాజం అయ్యప్ప స్వాములు కంచి పరమేశ్వర రెడ్డిని వారి యొక్క ఆఫీస్ నందు కలవడం జరిగింది. ఈ సందర్భంగా శివాలయం నందు అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం ఏర్పాటు చేయమని కోరగా అయ్యప్ప స్వాములకు భరోసా కల్పిస్తూ ఈ పూజా కార్యక్రమానికి మీరు ఎక్కడ డొనేషన్ అడగవలసిన అవసరం లేదు ఈ కార్యక్రమం మొత్తం నేనే దగ్గరుండి జరిపిస్తాను మీరు స్వేచ్ఛగా సంతోషంగా ఆనందదాయకంగా ఈ పూజా కార్యక్రమం జరుపుకోండి అని చెప్పిన పరమేశ్వర రెడ్డి ఆరోజు పడి పూజకి విచ్చేయు అయ్యప్ప స్వాములకు, పూజా కార్యక్రమం విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం కూడా ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొంటానని వారికి భరోసా కల్పించారు. చెప్పినట్లుగా అయ్యప్ప స్వామి పడిపూజ, అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. శనివారం నాడు నిత్యాన్నదాత శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి గారు ట్రస్ట్ సభ్యుల ద్వారా మొత్తం ఖర్చును 2,62,400 రూపాయలు అయ్యప్ప స్వామి సేవా సమాజం – ఆత్మకూరు వారికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి సేవా సమాజం – ఆత్మకూరు అయ్యప్ప స్వాములు మాట్లాడుతూ ఎంతో ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజను నిర్వహించిన కంచి పరమేశ్వర రెడ్డికి ధన్యవాదాలు తెలియపరిచి వారు వారి కుటుంబ సభ్యులకు ఆ అయ్యప్పస్వామి ఆశీస్సులు కలకాలం ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

# పేరెంట్ - టీచర్ మీటింగ్‌కు మీ అమ్మ -నాన్నలను ఆహ్వానించండి

## సాంఘీక సంక్షేమశాఖ డిడి శ్రీనివాసులు

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్ – టీచర్ మీటింగ్‌కు మీ అమ్మా, నాన్నలను పిలవాలని సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు బి.శ్రీనివాసులు వసతిగృహంలో ఉంటున్న పిల్లలకు సూచించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రాన్ని తయారుచేసి తల్లిదండ్రులకు పంపి వారిని ఆహ్వానించాలన్నారు. అలాగే వసతి గృహ సంక్షేమ అధికారులు ఫోన్ ద్వారా వసతిగృహ పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రులు 7వ తేదీన జరిగే ఈ సమావేశానికి వస్తే తమ పిల్లల పరిస్థితులు, ఎలా చదువుతున్నారు. సమస్యలు, వారి ప్రవర్తన తెలుసుకోవచ్చునని చెప్పారు. తల్లి దండ్రులు వస్తె పిల్లలు సంతోషిస్తారన్నారు. పేరెంట్ టీచర్ మీటింగ్‌కు తల్లిదండ్రులు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తీరం దాటిన ఫెయింజల్ తుఫాన్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి సమీపంలో కారైకాల్ మహాబలిపురం తీరం దాటినట్లు సమాచారం. తుఫాను కారణంగా దక్షిణ కోస్తా రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు. ఫెయింజల్ తుఫాను కారణంగా నెల్లూరు కడప చిత్తూరు జిల్లాలతోపాటు మరో 4జిల్లాల్లో కూడా వర్షాలు కురిశాయి. తుఫాను కారణంగా నెల్లూరు జిల్లాలో నిన్న సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం. నెల్లూరు జిల్లాలో 65 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు సమాచారం. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఇళ్లకే పరిమితమైన జనజీవనం.

# కృష్ణపట్నం సముద్రతీరం ఒడ్డుకు కోత

▶ అప్రమత్తమైన అధికారులు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావం మూలంగా ప్రజలు కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపద్యంలో కృష్ణపట్నం సముద్ర తీర ప్రాంతం అల్లకల్లోలంగా ఉంది. సముద్రపు కెరటాలు ఎగిసిపడుతున్నాయి. ఈ మేరకు సముద్రపు అలలు తాకిడికి ఒడ్డు కోతకు గురి కావడం జరిగింది. తాసిల్దార్ బాలకృష్ణారెడ్డి ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. సముద్రం అలలు ముందుకు వచ్చి ఉండడం గుర్తించారు. దీంతో అధికారులు అప్రమత్తమైనారు. తీర ప్రాంత గ్రామ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తాసిల్దారు అన్నారు. ఎవరు కూడా బయటకు రావద్దని ఆయన తెలియజేశారు.

# 91.3 శాతం పింఛన్ల పంపిణీ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలో 91.3 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో అప్పాజీ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి పలువురు లబ్దిదారులకు నగదు అందజేశారు. అందుబాటులోని లేని లబ్దిదారులకు సోమవారం పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నవాజ్. సచివాలయ సిబ్బంది తదితరులు

# ఫించన్లు పంపిణీ చేసిన ఇంతా మల్లారెడ్డి



**కోవూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు నియోజకవర్గం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, సూచనల మేరకు కోవూరు మండలాధ్యక్షుడు ఇంత మల్లారెడ్డి ఆధ్వర్యంలో చెరువుపల్లి రంగమ్మకు రెండు నెలల పింఛన్ అందించడం జరిగింది. సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే రెండో నెలలో తీసేసేవాళ్లు. కానీ మన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు వరుసగా రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా మూడో నెలలో మొదటి రెండు నెలలు ఇవి కలిపి ఇవ్వాలని తెలపటం మాకు ఎంతో సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తీర ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే ఇంటూరి

- లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జోరు వానలో కొనసాగిన ఎమ్మెల్యే పర్యటన

**కందుకూరు, మేజర్‌న్యూస్ :** కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలం రామాయపట్నం తీర ప్రాంతంలో శనివారం అనగా శనివారం సాయంత్రం కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పర్యటించారు. తుఫాను దృష్ట్యా రామాయపట్నం వద్ద సముద్రం అలల తీవ్రతకు కోతకు గురైన సముద్ర ప్రాంతాన్ని అధికారులు, స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ సందర్భంగా రామాయపట్నం ప్రాంతాల్లో పర్యటించి తుఫాను ప్రభావం వలన తీవ్ర గాలులు పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపిన దృష్ట్యా పశువుల కాపరులు పొలాల్లో పనిచేసే రైతులు జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాలర్లు వేటకు వెళ్లరాదని సూచించారు. చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు బయటికి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు గ్రామ సచివాలయం వద్ద ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అవసరమైన చోట సహాయ కేంద్రాలు



ఏర్పాటు చేసి ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉండాలని సచివాలయ ఉద్యోగులకు కూటమి నేతలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు తహసిల్దార్ స్వర్ణ, ఎంపీడీవో వెంకటేశ్వరరావు స్థానిక టిడిపి జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# గమళ్లపాలేంలో చినుకు పడితే కరెంట్ కట్..



- గమళ్లపాలేం అంటే చిన్న చూపా..
- పట్టించుకోని విద్యుత్ అధికారులు..

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి పంచాయతీ లోని గమళ్లపాలేం గ్రామంలో చినుకు పడితే కరెంట్ పోవడం జరుగుతుందని దీనిపై విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు కరెంట్ ఆఫీస్‌కు విద్యుత్ అధికారులకు సమాచారం తెలిపిన నిర్లక్ష్యమైన సమాధానంతో పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గమళ్లపాలేం గ్రామం అంటే అవసరం లేదా ఏ సమస్య ఉన్న కన్నెత్తి చూడడం లేదని గమల్లపాలెం గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామం లోకి రావాలి అంటే రోడ్డు సరిగలేదు అని ఇటు కరెంట్ కూడా లేకుండా స్కూల్ పిల్లలకు పాఠశాలలకు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని అధికారులు పాలకులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదు అని చెబుతున్నారు. రాజకీనాయకులు ఎన్నికల సమయంలో మాత్రం మేమున్నాము అంటూ భరోసా ఇస్తూ ఎన్నికలు అయిన తరువాత పట్టించుకోని అధికారులు పాలకులు ఇలాంటి దుస్థితిలో మేమున్నామని దీనిపై ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జిల్లా కలెక్టర్ స్పందించి మా సమస్యలను పరిష్కరించాలని గమళ్లపాలేం గ్రామస్తులు కోరుతున్నారు.

# ఆత్మకూరులో ఎడతెరిపిలేని వర్షం.. జనాల్లో హర్షం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో, మండలంలో, డివిజన్ లోని అన్ని మండలాల్లో శనివారం ఎడతెరిపిలేకుండా వర్షంకురుస్తోంది, బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో మూడురోజులుగా స్వల్పంగా, శనివారం ఓమోస్తరు వర్షం ఏమాత్రం ఎడతెరిపిలేకుండా కురుస్తుండగా ఆకాశం తీవ్రంగా మేఘావృతమై భారీవర్షం కురిసేలా తలపిస్తోంది. ఈ వర్షానికి జనాలు హర్షం వ్యక్తం చేస్తుండగా రైతుల్లో అధికశాతం మంది సంతోషిస్తుండగా ఖరీఫ్‌సీజన్‌లో వరిసాగుచేసి కోత దశలో ఉన్న రైతులు, ఇటీవలనే నార్లుపోసిన రైతులు కొంత నష్టపోయేలా ఉన్నామని బాధపడుతున్నారు. కాగా ఈ వర్షం వలన ఎక్కడబడితే అక్కడ నీరు నిల్వచేరడం, రోడ్లు జలమయమవడంతోపాటు లోతట్టు ప్రాంతాలు బురదమయం కావడంతో జనజీవనానికి అసౌకర్యంగా ఉంది. డివిజన్‌లో బుధవారం వర్షపాతం పరిశీలిస్తే సీతారామపురం మండలంలో 0మి.మీ, మర్రిపాడు మండలంలో 2.6, చేజర్ల మండలంలో 11.4, ఆత్మకూరు మండలంలో 8.8, ఉదయగిరి మండలంలో 1.0, ఏఎస్‌పేట మండలంలో 6.6, అనంతసాగరం మండలంలో 6.4, సంగం మండలంలో 7.2, కలువాయి మండలంలో 12. మి.మీలవంతున వర్షపాతం నమోదైంది.



గురువారం కూడా అల్పపీడనప్రభావంతో వర్షం భారీగా కురవనుందన్న హెచ్చరికలతో జనాలు కొంత ఆందోళనకు గురవుతున్నారు. కాగా ఈ వర్షాలు ఆరంభంకాగానే స్తానిక ఆర్డీవో బి.పావని డివిజన్‌లోని అందరు తహశిల్దార్లు, అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాలు, నదీతీరప్రాంత గ్రామాలను కూడా పరిశీలించి అక్కడి ప్రజలను కూడా అప్రమత్తం చేశారు.



## వైభవోపేతంగా అంబలం పడిపూజ

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకిలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం అంబలం పడిపూజ వైభవోపేతంగా నిర్వహించారు. ఈ పడిపూజకు అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వాములు స్వామియే శరణం అయ్యప్ప భజనలతో హోరెత్తించారు. ఈ అంబలం పడిపూజ మక్కి పొట్టియ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పడి పూజలలో వాకా మహదేవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు రామచంద్రారెడ్డి, బొచ్చు అనిల్, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక బాలాజీనగర్లో శుక్రవారం రాత్రి అయ్యప్ప, శివయ్య మాలలు ధరించిన భక్తులు మహాపడి పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అయ్యప్పస్వామిని ప్రతిష్టించి 18 మెట్లను ఏర్పాటు చేశారు. భక్తుల అయ్యప్ప, శివనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. అనంతరం స్వామివారికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఈ బుడ్డోడు సామాన్యుడు కాదు..

- చాట్ల అక్షయ్ మహదేవ్‌ను అభినందించిన మంత్రి నారాయణ
- విద్యార్ధి కృషి, శిక్షణ, పట్టుదల ఈ విజయానికి మూలకారణం
- భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి ఆకాంక్ష



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** లిటిల్ ఏంజెల్స్ విద్యార్థి చాట్ల అక్షయ్ మహాదేవ్ జాతీయ స్థాయిలో సత్తా చాటారు. 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 2024లో జరిగిన ఆర్చరీ విభాగంలో అద్భుత ప్రతిభ చూపించి మూడు పతకాలను గెలుచుకున్నారు. దీంతో క్యాంపు కార్యాలయానికి వచ్చిన అక్షయ్‌ను మంత్రి పొంగూరు నారాయణ అభినందించారు. విద్యార్థి కృషి, శిక్షణ, పట్టుదల ఈ విజయానికి మూల కారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. కరస్పాండెంట్ చాట్ల నరసింహారావు కూడా విద్యార్ధిని ప్రత్యేకంగా అభినందించారు.

### ఫెంగల్ తుఫాన్ పట్ల

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఫెంగల్ తుఫాన్ కారణంగా భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో కోవూరు నియోజకవర్గం ప్రజలు, అధికారులు అప్రమత్తంగా వుండాలని కోవూరు ఎమ్మెల్యే వేపిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. లోతట్టు ప్రాంతాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కృష్ణపట్నం ఓడరేవులో 6వ నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేసి వున్న నేపథ్యంలో ఇందుకూరుపేట, విడవలూరు మండలాలలోని మత్యకారులు వేటకు వెళ్లొద్దని కోరారు. రైతు సోదరులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు గ్రామ సచివాలయ సిబ్బందితో సమన్వయంతో చేసుకుంటూ లోతట్టు ప్రాంతాలలోని చెరువులు, ప్రధాన కెనాల్స్ పటిష్టత పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అధికారులందరు మండల సహాయక కేంద్రాలలో ప్రజలకు అందుబాటులో వుండాలని ఆదేశించారు. అవసరమైతే సహాయక కార్యక్రమాలలో పాల్గొనేందుకై స్థానిక తెలుగుదేశం నాయకులు సన్నద్ధంగా కావాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోరారు.